క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వీరన్నపేటలో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం సర్పంచ్ కొండపాక భిక్షపతి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎలికట్టె శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు వల్లూరి శ్రీనివాస్, అరిగె భిక్షపతి, మాజీ ఎంపీటీసీ పెద్దింటి ప్రసాద్, వార్డు సభ్యులు, నాయకులు కనకయ్య, సత్యనారాయణ, గోవిందాచారి, శ్రీనివాస్, మధు, యాదయ్య, సత్యనారాయణరెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం'

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలో పదేళ్ల పాటు పాలన సాగించిన కేసీఆర్ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించతలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం గజ్వేల్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులపై దాడులను అరికట్టడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో పాటు ఉద్యోగాల కల్పనలో నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. ధరణి పేరుతో పేదల భూములను హరించారని, కౌలు రైతులను పట్టించుకోలేదని వాపోయారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంతో పాటు ఎన్నికల హామీలకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత ఉద్యోగుల సంఘం నాయకులు ఎల్లయ్య, డీబీఎఫ్ నాయకులు ఏగొండస్వామి, వేణు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ


పూజలు నిర్వహిస్తున్న స్వాములు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్ పల్లెలో ఆదివారం అయ్యప్ప పడి పూజను వైభవంగా నిర్వహించారు. పూలు, పండ్లతో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు, దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పారు



మాట్లాడుతున్న భాస్కర్

దుబ్బాక: మతతత్వ బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని గౌరవించిన దుబ్బాక నియోజకవర్గ ఓటర్లకు సీపీఎం పార్టీ తరఫున ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ ఆదివారం పేర్కొన్నారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కంపెల్లి భాస్కర్, బత్తుల రాజు, మెరుగు రాజు, ఎండీ. సాజిద్ పాల్గొన్నారు.

ఆహ్వానం


ఆహ్వానపత్రిక అందిస్తున్న ట్రస్టు సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో నెలకొల్పనున్న శ్రీ గురుపీఠం శిలాన్యాసంకు హాజరు కావాలని పలువురు ప్రముఖులకు ఆదివారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. శ్రీ గురుపీఠం వ్యవస్థపకుడు శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సాయి టీవీ వ్యవస్థాపకులు అనిల్ సాయివాణి దంపతులను కలిసి ఆహ్వానించారు. శ్రీ గురుపీఠం శిలాన్యాసం ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు తప్పకుండా హాజరుకావాలని శివకుమార్‌గౌడ్ కోరారు. వీరితో పాలు పలువురికి కూడా ఆహ్వానించారు. కార్యక్రమంలో బగలాముఖీ ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, శ్రీ గురుపీఠం ట్రస్టు సభ్యులు మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రత్యేక పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చాముండేశ్వరి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు


హుస్నాబాద్: సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు


బెజ్జంకిలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

హుస్నాబాద్‌రూరల్/కోహెడ/బెజ్జంకి(సిద్దిపేట)/దౌల్తాబాద్(దుబ్బాక)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్‌గౌడ్ గెలుపొందడంతో ఆదివారం అంబేడ్కర్ చౌరస్తాలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన ఉంటుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొంగొని శ్రీనివాస్, నాయకులు కుమారస్వామి, సంగ శ్రీధర్, పిట్టల వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కోహెడలో కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. బెజ్జంకిలో మానకొండూరు ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందడంతో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడి, కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో కాంగ్రెస్ కార్యకర్తలు బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు, నాయకులు, ఆది వేణు, మద్దెల స్వామి, తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో టీపీసీసీ సెక్రటరీ గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు.

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు బాబేష్, రఘుపతి, శ్రీకాంత్, మురళి, లింగం, పర్శరాములు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సర్దార్‌ఖాన్, ఇప్ప ప్రభాకర్, వహీద్, పరుచూరి రాజు, మున్న, జాకీర్, శ్రీకాంత్, సుదర్శన్, అంజి తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో పార్టీ అధ్యక్షులు వాసరి లింగారావు, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంతో పాటు గౌరవెల్లి, రామవరం గ్రామాల్లో పొన్నం గెలుపొందడం పట్ల టపాకాయలు కాల్చి సంబురాలను జరుపుకున్నారు.

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మార్క సతీష్‌గౌడ్, మహేందర్, పూజల హరికృష్ణ, గంప మహేందర్, బొమ్మల యాదగిరి, అత్తు పాల్గొన్నారు.


సిద్దిపేటలో..


కుకునూరుపల్లిలో..


కోహెడలో..


దౌల్తాబాద్ మండల కేంద్రంలో..


సిద్దిపేట పట్టణంలో..

దుబ్బాక ప్రజలకు రుణపడి ఉంటా..


మాట్లాడుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: ప్రచారానికి రాకున్నా.. భారీ మెజార్టీతో గెలిపించిన దుబ్బాక ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. నన్ను బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించడంతోనే ప్రత్యర్థులకు గెలువమనే ఆందోళన నెలకొందన్నారు. నన్ను హత్య చేస్తే రాజకీయంగా అవకాశం ఉంటుందని కుట్ర పన్నారని ఆరోపించారు. దేవుడి దయ, దుబ్బాక ప్రజల ఆశీస్సులతోనే మళ్లీ బతికానన్నారు. శేష జీవితమంతా దుబ్బాక ప్రజలకే అంకితమని.. ఆస్పత్రిలో ఉన్నా అండగా నిలిచి ప్రచారం చేశారని కొనియాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రాకపోవడం బాధగా ఉన్నప్పటికీ, దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

నాలుగోసారి ఎమ్మెల్యేగా దామోదర

- అందోల్‌లో తన రికార్డును తానే బ్రేక్ చేసిన వైనం
- 28,193 ఓట్ల మెజార్టీతో గెలుపు

జోగిపేట (అందోల్): అందోల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 16 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అత్యధికంగా 9 సార్లు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు గెలుపొందగా, వీరిలో దామోదర్ కుటుంబ సభ్యులే ఆరు సార్లు విజయాన్ని సాధించారు. అయితే వీరిలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన అభ్యర్థి, అతి తక్కువ ఓట్లతో ఓటమి చెందిన అభ్యర్థి సి.దామోదర్ రాజనర్సింహ కావడం విశేషం. అందోల్ నియోజకవర్గంలో 2004 లో జరిగిన ఎన్నికలలో 24,846 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన అభ్యర్థిగా రికార్డు ఉంది. మళ్లీ ఈ ఎన్నికలలో ఆ రికార్డును బ్రేక్ చేశారు. 28,193 ఓట్లతో గెలుపొందారు. దామోదర్ తండ్రి రాజనర్సింహ మరణానంతరం 1989 లో రాజకీయ రంగప్రవేశం చేసిన దామోదర్ రాజనర్సింహ టీడీపీ అభ్యర్థి మల్యాల రాజయ్యపై 3014 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత 1994, 1998, 1999 వరుసగా మూడు ఓటమి చెందారు. 2004 లో 24,846 ఓట్ల మెజార్టీతో, 2009లో 2,906 ఓట్ల మెజార్టీతో బాబుమోహన్‌పై గెలుపొందారు. 2014, 2018 ఎన్నికల్లో ఓటమి చెందగా, 2023లో 28,193 ఓట్లతో విజయం సాధించారు.


దేవతామూర్తులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహ

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులతో పాటు జీవన్ముక్త మహారాజ్‌కు దామోదర రాజనర్సింహ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో దామోదర రాజనర్సింహ అందోల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు ప్రకటించడంతో ఆలయాల్లో పూజలు చేశారు. అంతకుముందు బుదేరా, కంకోల్, మేళసంగ్యం, పెద్దచల్మెడ, మన్‌సాన్‌పల్లి, తాటిపల్లి గ్రామాలలో దామోదరను సన్మానించారు. ప్రతీ గ్రామంలో టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

జిన్నారం(పటాన్‌చెరు): ఈనెల 5 నుంచి గద్వాల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ ఎస్‌జీఎఫ్‌మీట్‌కు జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ ఆదివారం తెలిపారు. అండర్ 17 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో విద్యార్థులు ప్రతాప్, జశ్వంత్ పాల్గొననున్నారు. వీరు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు.

ఇది ప్రజా విజయం

ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్: తన విజయం ప్రజా విజయమని నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శాసన సభ్యుడిగా గెలుపొందిన సందర్భంగా ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు. తమకు ప్రచారం చేయడానికి చాలా తక్కువ సమయం ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి తన గెలుపుకోసం కృషి చేశారన్నారు. అధికారపార్టీ డబ్బు, మద్యంతో పలువురు ఓటర్లను ప్రలోభపెట్టినప్పటికీ ప్రజలు మాత్రం తమవైపే ఉన్నారన్నారు. అధికార పార్టీ వారు తమ కార్యకర్తలపై దౌర్జన్యం చేయడానికి తోడు కొన్ని చోట్ల ప్రచారాన్ని కూడా అడ్డుకున్నారని, అయినప్పటికీ ప్రజలు తమను, కాంగ్రెస్ పార్టీని ఆదరించారని తెలిపారు. ఈ విజయం ప్రజలకు అంకితం చేస్తామని, తమ విజయానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషికి తోడు ప్రజలు ఆదరించారన్నారు. తమ తండ్రి దివంగత కృష్ణారెడ్డి స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానన్నారు. విజయానికి కృషి చేసిన కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.


హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

ప్రతి రౌండ్‌లోనూ బీఆర్‌ఎస్‌దే ఆధిక్యం

- గజ్వేల్‌లో కేసీఆర్ ఘన విజయం
- బీజేపీ అభ్యర్థి ఈటలపై 45,031 ఓట్ల ఆధిక్యం

గజ్వేల్: తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో జనం కేసీఆర్ పక్షానే నిలబడ్డారు. ప్రస్తుత ఎన్నికల్లో 45,031 ఓట్ల భారీ మెజార్టీని అందించారు. 23 రౌండ్లుగా సాగిన ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ బీఆర్‌ఎస్‌కు ఆధిక్యాన్ని అందించారు. తిరస్కరణకు గురైన 39 ఓట్లు మినహాయిస్తే మొత్తంగా ఇక్కడ పోస్టల్ బ్యాలెట్‌తో కలుపుకొని 2,32,417 ఓట్లు పోల్ కాగా.. అందులో కేసీఆర్‌కు 1,11,684 ఓట్లు దక్కాయి. సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 66,653 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డికి 32,568 ఓట్లు వచ్చాయి. బరిలో ఉన్న మరో 41 మంది అభ్యర్థులకు 21,512 ఓట్లు వచ్చాయి. ఇందులో భాగంగానే నోటాకు 832 ఓట్లు పడ్డాయి. సిద్దిపేటలోని ఇందూరు కళాశాలలో ఏర్పాటు చేసిన కౌటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు ఆసక్తికరంగా సాగింది. ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. బీఆర్‌ఎస్ శ్రేణుల్లో కేసీఆర్‌కు ఎంత మెజార్టీ రాబోతుందనే అంశాన్ని ఉత్కంఠగా ఎదురు చూశారు. ఇందూర్ కళాశాలలో గజ్వేల్‌తో పాటు సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాల లెక్కింపు జరగగా.. ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ మధ్యాహ్నం 2 గంటల వరకే దాదాపుగా పూర్తికావొచ్చింది. కానీ గజ్వేల్‌కు సంబంధించి 321 పోలింగ్ కేంద్రాలు ఉండడం, 23 రౌండ్లుగా లెక్కింపు చేపట్టడం వల్ల పూర్తయ్యేసరికి రాత్రి 7:30 గంటలు దాటింది. గజ్వేల్ రిటర్నింగ్ అధికారి బన్సీలాల్ కేసీఆర్ గెలిచినట్లు అధికారికంగా ప్రకటించారు. గెలుపు ధృవీకరణ పత్రాన్ని కేసీఆర్ చీఫ్ ఎన్నికల ఏజెంట్, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సమక్షంలో గజ్వేల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బన్సీలాల్ చేతుల మీదుగా అందుకున్నారు. కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

2018 ఎన్నికలతో పోలిస్తే తగ్గిన మెజార్టీ

2018 ఎన్నికల్లో కేసీఆర్‌కు 58,290 మెజార్టీ రాగా ప్రస్తుత ఎన్నికల్లో 13,259 ఓట్ల మెజార్టీ దక్కడం బీఆర్‌ఎస్ శ్రేణులను నిరాశపరిచింది. కేసీఆర్‌కు పోటీ ఇచ్చిన ఈటల రాజేందర్ అతి తక్కువ వ్యవధిలోనే 66,653 ఓట్లు రావడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోవడం, గజ్వేల్‌లోనూ కేసీఆర్ మెజార్టీ తగ్గడం శ్రేణులను నిరుత్సాహానికి గురిచేసింది. కాగా మొత్తంగా పోలైన 1,447 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఈటల రాజేందర్‌కు అధికంగా 692, కేసీఆర్‌కు 440, కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డికి 246 ఓట్లు పడ్డాయి.

బాణాసంచా కాల్చి.. స్వీట్లు పంచి


మర్పడ్గలో బాణాసంచా కాలుస్తున్న నాయకులు


దుబ్బాక: ఎల్‌ఈడీ స్క్రీన్‌లో ఫలితాలు వీక్షిస్తున్న నాయకులు

దుబ్బాక/మిరుదొడ్డి(దుబ్బాక)/తొగుట/కొండపాక(గజ్వేల్): దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా భారీ విజయం సాధించడంపై మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచి బణాసంచా కాల్చారు. అలాగే దుబ్బాకలో సంబరాలు జరుపుకున్నారు. ఓటింగ్ సరళిని తెలుసుకోవడానికి దుబ్బాక క్యాంపు కార్యాలయంలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. తొగుటలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హమీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎఎంసీ చైర్మన్ కొమురయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గెలుపొందడంపై కొండపాక, కుకునూరుపల్లి మండలాలవ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు.


మిరుదొడ్డిలో బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు

ప్రజాతీర్పుపై విశ్లేషిస్తాం

నారాయణఖేడ్: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తానని నారాయణఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం రెండో స్థానంలో నిలిచిన ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తాను ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషిచేశానని, అయినప్పటికీ ప్రజలు ఇచ్చిన తీర్పుపై విశ్లేషణ చేసుకొని వారికి అందుబాటులో ఉంటాన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని చెప్పారు. ఎన్నికల్లో తనకోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఈ తీర్పును గౌరవిస్తానని అన్నారు. ఆయన వెంట ఖేడ్ మండల పార్టీ అధ్యక్షుడు పరమేశ్వర్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, నగేష్ పాల్గొన్నారు.

ప్రజాతీర్పును గౌరవిస్తున్నా: క్రాంతికిరణ్


మాట్లాడుతున్న క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): అసెంబ్లీ ఎన్నికల్లో అందోల్ ప్రజాతీర్పును గౌరవిస్తున్నానని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఆదివారం వెలువడిన ఫలితాలపై మాట్లాడారు. గెలుపోటములు సహజమన్నారు. తన ఓటమికి గల కారణాలను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సమీక్షించుకుంటామని తెలిపారు. ఐదేళ్లపాటు ప్రజాసేవ చేసేందుకు అవకాశం కల్పించిన అందోల్ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఈ ఎన్నికల్లో తనకు సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధైర్య పడొద్దని అండగా ఉంటానన్నారు. తనకు ఓటేసిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టీఎస్‌టీపీసీ చైర్మన్ భిక్షపతి, మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్య, జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.